ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 06 జనవరి, 2026 | పేజీలు :08

## ఎఐటియుసి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన ఎం.ఎ.గౌస్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ ఇంక్లైన్ దగ్గర లో ఉన్న నర్సరీ లో పని చేస్తున్న కార్మికుల చే సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ లను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నర్సరీ లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు తో పాటు సౌకర్యాలు కల్పించాలని ఆయన యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో నర్సరీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతకు ఎటిసి నైపుణ్య శిక్షణ కోర్సుల ద్వారా ఉపాధి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఏ.టి.సి నైపుణ్య శిక్షణ కోర్సుల ద్వారా యువతకు తప్పనిసరిగా ఉపాధి లభిస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం పెద్దపల్లి ఐటిఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏ.టి.సి సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ.టి.సి, ఐటిఐ సెంటర్ ద్వారా అందిస్తున్న కోర్సుల వివరాలు, కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత ఎంత మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి,వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ప్రారంభించిన ఏ.టి.సి సెంటర్ లో సంవత్సరం శిక్షణ పూర్తి చేసుకున్న దాదాపు 70 మంది ఉద్యోగులకు ఉపాధి లభించడం జరిగిందని అన్నారు.టాటా సంస్థ సౌజన్యంతో షార్ట్ టర్మ్ కోర్సుల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఏ.టి.సీ కోర్సులు పొందేందుకు అర్హులని ,ఈ కోర్సులతో మల్టి నేషనల్ కంపెనీలలో తప్పనిసరిగా ఉద్యోగం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ఒక సంవత్సరం కాలపరిమితి గల మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ & డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టీసీ యూజింగ్ అడ్వాన్స్ టూల్ కోర్సులలో 40 సీట్లు ఉన్నాయని, రెండు సంవత్సరాల కాల పరిమితి గల బేసిక్ డిజైనర్ అండ్ పర్చుయల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్సుడ్ సి.ఎన్.సి మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులలో 24 సీట్లు ఉన్నాయని తెలిపారు.ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ ప్రకారం టాటా కన్సల్టిస్ వారితో సమన్వయం చేసుకొని ఈ కోర్సులను డిజైన్ చేశామని అన్నారు.జిల్లాలో ఉన్న యువత యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కోర్సులలో జాయిన్ కావాలని కలెక్టర్ కోరారు.అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోరారు. అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రంలో ప్రవేశాలకు కనీస వయసు 14 సంవత్సరాలు మాత్రమేనని అన్నారు.ఈ పర్యటనలు జిల్లా కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, ట్రైనింగ్ అధికారులు శ్రీనివాసు,మల్లికార్జున్, సూపరింటెండెంట్ కృష్ణ వేణి, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణితో సమస్యల పరిష్కారం: ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజావాణితో సమస్యల పరిష్కారం లభిస్తుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 129 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపారు. రెవెన్యూ శాఖకు 54, జిల్లా పంచాయతీ అధికారి 18, గృహ నిర్మాణ శాఖకు 11, జిల్లా విద్యాధికారికి 9, ఉపాధి కల్పన అధికారికి 6, డీఆర్డీఓ 5, జిల్లా సంక్షేమ శాఖ 4, ఎండీ సెస్, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కు మూడు చొప్పున, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, నీటి పారుదల శాఖ 2, మత్స్య శాఖ, భూగర్భ జలాల శాఖ, పరిశ్రమల శాఖ, ఎస్పీ ఆఫీసు, జిల్లా వైద్యాధికారి, మైనార్టీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ, జిల్లా రిజిస్టార్, శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈఓ వేములవాడకు ఒకటి చొప్పున వచ్చాయి.

**వైద్య భవనాలకు స్థలాలు గుర్తించాలి..**

జిల్లాలోని ఆయా మండలాల్లో నూతన వైద్య భవనాల నిర్మాణాలకు స్థలాలు గుర్తించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పశు వైద్యశాలల్లో అవసరమైన మరుగుదొడ్ల నిర్మాణాలు మొదలు పెట్టి నెల రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో గీజర్స్, ఇతర పరికరాలపై ఆరా తీశారు.

**ఇంచార్జి కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు..**

జిల్లాలోని ఎస్సీ వెల్ఫేర్ విద్యా సంస్థల విద్యార్థులు చేతి రాతతో తీర్చిదిద్దిన నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఆయా శాఖల జిల్లా అధికారులకు అందజేశారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధా భాయ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా నగరపాలిక కమిషనర్ ప్రపుల్ దేశాయ్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 299 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 68, హౌసింగ్ శాఖకు సంబంధించి 43 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**జిల్లా అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలి**

కొత్త ఏడాది వేళ.. అధికారులందరూ జిల్లా అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సంవత్సరం పురస్కరించుకొని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సంఘాల నాయకులు కలెక్టర్, అదనపు కలెక్టర్లను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీఎన్జీవో, టీజీవో సంఘాలకు సంబంధించి క్యాలెండర్లను ఆవిష్కరించారు.

## అన్నయ్య గౌడ్‌ను పరమార్శించిన ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ తండ్రి అంతటి రాయలింగు గౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించడంతో పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు వంశీకృష్ణ అన్నయ్య గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం విచ్చేసిన పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు వంశీకృష్ణ అంతటి అన్నయ్య గౌడ్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. అన్నయ్య గౌడ్ కు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గజబీన్ కార్ జగన్, మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, చింతల రాజు, దున్నపోతుల రాజయ్య, దుగ్యాల సంతోష్, న్యాతరిదేవేందర్, గాదాసు రవీందర్,నోముల శ్రీనివాస్ రెడ్డి,సజ్జద్ తదితరులున్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన ఇంద్ల కొమురయ్య ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల సుధాకర్ రెడ్డి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 204 లో 20 గుంటల విస్తీర్ణ భూమి ఇతరులకు పేరు మీద ఉందని దానిని తన పేరు కు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎలిగేడు తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఇందారపు శంకరమ్మ డిసెంబర్ 20–2025 న ఇల్లు కాలిపోయిందని, తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపిడిఓ మంథని కు రాస్తూ వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తనను రక్షించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో పెద్దపల్లి రాస్తూ వృద్ధుల సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సేవలు అభినందనీయం

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : బాలింతలకు, చిన్నారులకు అంగన్వాడీలు అందిస్తున్న సేవలు అభినందనీయమని సుల్తానాబాద్ మండలంలోని నరసయ్య పల్లి గ్రామ సర్పంచ్ డాక్టర్ జూపల్లి తిరుమల్ రావు అన్నారు.సోమవారం నర్సయ్య పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.6 నెలల నుండి మూడు సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలకు బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ జూపల్లి తిరుమల రావు మాట్లాడుతూ, అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలకు అందుతున్న సేవలు అభినందనీయమని అన్నారు. చదువు, సంధ్యలతో పాటు పిల్లలు, వారి తల్లుల ఆరోగ్యం పట్ల అందుతున్న సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మ్యాకల మమత, పంచాయతీ సెక్రెటరీ మౌనిక, సబ్ సెంటర్ డాక్టర్ సంతోష్ కుమార్, ఏఎన్ఎం భూలక్ష్మి, ఆశా వర్కర్ రాయిల్ల జమున, వార్డు మెంబర్లు సుధాకర్, కవిత, స్వరూప, ఉప్పలయ్య, తిరుపతి, రాజు, పంచాయతీ కారోబార్ సంపత్, గ్రామ ప్రజలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు. అంగన్వాడి సెంటర్ టీచర్ పి. సునీత ఈ సందర్భంగా సర్పంచ్ పాలక వర్గాన్ని శాలువాలతో సత్కరించారు.

## ఎన్నికలపై రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాపక్షం/చొప్పదండి: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ కె.నాగరాజు ఆధ్వర్యంలో చొప్పదండి పురపాలక సంఘం కార్యాలయంలో పట్టణంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. హాజరైన వివిధ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన వివిధ అంశాలకు కమిషనర్ సమాధానాలిచ్చారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ డి.ప్రశాంత్, బిజెపి పట్టణ అధ్యక్షుడు చిల్ల శ్రావణ్ కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు చిల్ల వెంకటేశంలు పాల్గొన్నారు.

## మాస్టర్ మైండ్ పాఠశాల నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ది మాస్టర్మైండ్స్ పాఠశాల నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాల చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్యామ్, ఎల్లారెడ్డిపేట పాఠశాల ప్రిన్సిపాల్ లవీన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజారాం, అరుణ్ పాల్గొన్నారు.

## ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుందని అన్నారు.

## గాయత్రి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : సోమవారం రోజున పెద్దపల్లి జిల్లాలోని రంగాపూర్ గ్రామంలో గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల వారు 50 మంది వాలంటీర్లతో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగాపూర్ గ్రామ సర్పంచ్ గంట రమేష్ ,ఉపసర్పంచ్ కొండ శ్రావణ్ ,ఐదవ వార్డ్ మెంబర్ ఈర్ల సంతోష్ వెన్నెల , గాయత్రి కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ , పంచాయితీ సెక్రటరీ గుమ్మడి సదయ్య, జడ్పీ హైస్కూల్ హెచ్ ఎం పీ శారద,ఇన్చార్జి హెచ్ఎం ఆర్ స్వామి పాల్గొనడం జరిగింది. సర్పంచ్ గంట రమేష్ మాట్లాడుతూ గాయత్రి కళాశాల విద్యార్థులు ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవాభావంతో ముందుకు వచ్చి తమ గ్రామ అభివృద్ధిలో భాగం కావడం అభినందనీయమని వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తమ గ్రామాన్ని ఎంచుకున్నందుకు వారికి అభినందనలు తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ మొదటి రోజులో భాగంగా జడ్పీ హైస్కూల్ ఆవరణలో కలుపు మొక్కలు తీయడం, శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం ఏ సమద్, అధ్యాపకులు ఏం డి ఖాదర్, ఎన్ ఆమని పాల్గొనడం జరిగింది.

## ఇసుక లారీని అడ్డుకున్న గ్రామస్తులు




ప్రజాపక్షం/ముత్తారం: మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని (టిప్పర్) గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.ముత్తారం మండలం లోని ఓడేడు మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ను సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు.గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం పనుల్లో భాగంగా ఓడేడు మానేరు నుంచి కాంట్రాక్టర్ ఒక టిప్పర్ లోడ్ ఇసుకను తరలిస్తుండగా, దీన్ని గమనించిన గ్రామస్తులు టిప్పర్ను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి అక్కడికి చేరుకొని ఇసుక అక్రమ రవాణాపై జిల్లా మైనింగ్ అధికారులను, ముత్తారం రెవెన్యూ అధికారులను ఆరా తీశారు. అయితే సామాన్యుడు గృహ నిర్మాణాల కోసం ఒక ట్రాక్టర్ లోడ్ ఇసుక తీసుకుంటేనే అక్రమంగా తరలిస్తున్నారని కేసులు పెట్టే అధికారులు టిప్పర్ లోడ్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న పట్టించుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నిర్మాణం పనులకు సంబంధించి ఇసుకను తరలించేయుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని మైనింగ్, రెవెన్యూ అధికారులు పోతిపెద్ది కిషన్ రెడ్డికి వివరణ ఇచ్చారు. దీనిపై అక్కడికి చేరుకున్న రిపోర్టర్లు ముత్తారం ఆర్ఐ రాజబాబునుని వివరణ కోరగా, జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఒక టిప్పర్ లోడ్ ఇసుకను టెస్టింగ్ కోసం అనుమతించామని తెలిపారు. ఇదే విషయంపై ముత్తారం తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి వివరణ కోరగా, తాము ఎలాంటి అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. మైనింగ్ ఏడి శ్రీనివాస్ను వివరణ కోరగా తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, ఒకవేళ టెస్టింగ్ కోసం తీసుకెళ్లాలనుకుంటే కేవలం 4 నుంచి 5 బస్తాలు మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది, ఒక టిప్పర్ లోడ్ ఇసుకను తీసుకెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. సమాచారం అందుకున్న ముత్తారం పోలీసులు అక్కడికి చేరుకొని అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు.

## సర్పంచ్ చొరవతో దుమ్ము, ధూళి నివారణకు నీళ్లు చల్లింపు

ప్రజాపక్షం/ముత్తారం : ఎన్నో రోజులుగా దుమ్ము, ధూళితో రహదారికి ఇరువైపులా ఉన్న ఇండ్లలోని ప్రజలతోపాటు కిరణం షాపు, కూరగాయల వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.వారు పడుతున్న బాధలు అధికారులకు చెప్పిన కూడా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇటీవలే నూతన సర్పంచిగా గెలుపొందిన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రం సర్పంచ్ సూదాటి రవీందర్ రావు స్పందించి ట్రాక్టర్ వాటర్ ట్యాంక్ తో ముత్తారం పరిధి నుండి పోలీస్ స్టేషన్ దగ్గరలోని ఫంక్షన్ హాల్ వరకు ప్రధాన రహదారికి నీళ్లను చల్లిస్తూ దుమ్ము, దూళి లేవకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముత్తారం నుండి మంథని,గోదావరిఖని వైపు వెళ్లే వాహనదారుల తో వచ్చే దుమ్ము దూళితో ఎన్నో నెలలుగా ఇబ్బందులు పడ్డ ప్రజలు నూతనంగా గెలిచిన సర్పంచ్ దుమ్ము ధూళి నివారణ కోసం ట్రాక్టర్ సహాయంతో ట్యాంకర్ ఏర్పాటు చేసి నీళ్లు చల్లించడం పట్ల సర్పంచ్ రవీందర్ రావు కి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎఐటియుసి డిపార్ట్మెంట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్కు మాతృ వియోగం

ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆర్జీ వన్ సివిల్ డిపార్ట్మెంట్ కార్యదర్శి కామ్రేడ్ దాసరి శ్రీనివాస్ తల్లి దాసరి కాంతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని హాస్పిటల్ లో వైద్య చికిత్స తీసుకుంటూ సోమవారం అకాల మరణం చెందడం తో విషయం తెలుసుకున్న ఏఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మడ్డి ఎల్లా గౌడ్ శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆమె పార్థీవ దేహం పై పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఇంకా నివాళులు అర్పించిన వారిలో నాయకులు రంగు శ్రీనివాస్, మాదన మహేష్, బోగ సతీష్ బాబు, కే.శ్రీనివాసరావు, గుర్రం ప్రభుదాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, నాయిని శంకర్, బిట్టు వెంకటేశ్వర్లు, చంద తిరుపతి, భక్తి శ్రీనివాస్, గొడిశల నరేష్, జే.దేవయ్య ,తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కార్డు అందజేత

ప్రజాపక్షం/రామగిరి : రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహించి, డిసెంబర్31న ఉద్యోగ విరమణ పొందిన నరేంద్ర సుధాకరరావు కు సోమవారం జిఎం కార్యాలయం నందు రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ పొందినవారికి సింగరేణి సంస్థ సి పి ఆర్ ఎం ఎస్ (కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీం) క్రింద ఇచ్చే మెడికల్ కార్డును అందజేశారు.కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం ఉన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న మహేంద్ర బొలెరో వాహనం పట్టివేత

ప్రజా పక్షం/సుల్తానాబాద్ : ఆదివారం రాత్రి సమయంలో ఎస్సై చంద్రకుమార్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కదంబపూర్ మానేరు నుంచి కరీంనగర్ కి అక్రమంగా ఇసుక తరలిస్తున్నటువంటి మహేంద్ర బొలెరో వాహనాన్ని గర్రెపల్లి గ్రామంలో పట్టుబడినట్టు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఇట్టి విషయంలో వాహన యజమాని సయ్యద్ వలి r/o కదంబపూర్,డ్రైవర్ షేక్ బషీర్ ఇద్దరిపై కేసు నమోదు చేసి బొలెరో వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినట్లయితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ చంద్రకుమార్ హెచ్చరించారు.

## ఇటికబట్టీల అనుమతులు రద్దు చేయండి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలం లోని రంగాపూర్ గ్రామం లో సోమవారం జరిగిన గ్రామ సభలో గత పాలక వర్గంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని గ్రామస్తులు కొత్త పాలక వర్గానికి వినతి పత్రం అందించారు. గ్రామ శివారులో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల కాలుష్యం వలన ప్రజలు అనారోగ్యానికి గురిఅవుతున్నారని, దుమ్ము ధూళి తో రైతులకు పంటనష్టం జరుగుతుంది అని, గీత కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారని, రోడ్డు ప్రమాదాలు విరివిగా జూరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రంగాపూర్ మాజీ ఎం పి టి సి గంట సదయ్య, మాజీ ఉపసర్పంచ్ కొయ్యడ సారయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డుపల్లి అశోకు, రావుఫ్ అహెమద్ తో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఓటరు లిస్టు సవరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం



ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ఓటరు లిస్టు సవరించాలని కోరుతూ రేకుర్తి గ్రామ నాయకుడు దుర్గం మనోహర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ పమేలా సత్పతికివినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా దుర్గం మనోహర్ మాట్లాడుతూ రేకుర్తి 18, 19వ డివిజన్లకు సంబంధించి ఓటరు లిస్టులోని ఓటరు పేర్లు వివిధ డివిజన్ లోకి మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ మిగతా 60 డివిజన్లలో గల ఓటర్ల పేర్లు ఇక్కడికి వచ్చాయన్నారు. ఒక డివిజన్లోని ఓటర్ల పేర్లు ఇంకొక డివిజన్‌లోకి మారడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఓటర్ల పేర్లను డివిజన్ల వారీగా ఏ డివిజన్ ఓటర్లు ఆ డివిజన్‌లలోకి వచ్చే విధంగా సవరణ చేయాలని కోరారు. రేకుర్తి ప్రభుత్వ భూములు కబ్జాలు చేసుకుని తప్పుడు ఇంటినెంబర్లను తీసుకుని ఓటర్లుగా నమోదు చేసుకున్న వారి పేర్లను రేకుర్తి ఓటర్ లిస్టులో నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పిట్టల సత్యనారాయణ, హస్తపురం అంజయ్య, గోదారి చంద్రయ్య, జి.బాలకృష్ణ తదితరులున్నారు.

## బస్తీ దవాఖానను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాపక్షం/బోధన్: బోధన్ పట్టణంలోని చావడీ వార్డు నంబర్ 32లోని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న బస్తీ దవాఖానను బోదన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో సోమవారం పరిశీలించారు. అనంతరం ప్రస్తుతం ప్రైవేట్ భవనాల్లో పని చేస్తున్న ప్రభుత్వ కార్యాలయాలను మార్చడానికి, వాటి అనుకూలతను అంచనా వేయడానికి అచ్చంపల్లిలోని జిపి భవనం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనాలను పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట బోధన్ మున్సిపల్ ఇంజనీర్లు, డీఈ, ఎఈ ఉన్నారు.

## వెల్మల్‌లో ప్రత్యేక సొసైటీ ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/నందిపేట్: నందిపేట్ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిదిలో ప్రత్యేక సహకార సంఘం ఏర్పాటు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి గ్రామంలోని అఖిలపక్షం నాయకులు వివరించారు. ఈ సంఘ సరిహద్దు గ్రామాలైన ఆంధ్రనగర్, కౌల్‌పూర్, రైతుపారం, జోజిపేట్ గ్రామాలున్నాయని, సుమారు నాలుగు వేల ఎకరాలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్, ఉపసర్పంచ్ మహేశ్ తదితరులు కలెక్టర్‌ను కలిశారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

ప్రజాపక్షం/బోధన్: బోధన్ పట్టణంలోని ఆటో నగర్‌కు చెందిన షేక్ సల్మాన్ మద్యం తాగి వాహనం నడిపినందుకు గాను పది రోజుల జైలు శిక్ష విధించారు. బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన నలుగురు వ్యక్తులను బోధన్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేష తల్ప సాయి ముందు హాజరు పరిచారు. మద్యం సేవించిన వాహనం నడిపిన ముగ్గురు వ్యక్తులకు 30000 రూపాయాలు జరిమానా విధించగా, మరో వ్యక్తికి పది రోజుల జైలు శిక్ష విధించినట్లు బోధన్ పట్టణ సిఐ వెంకట్ నారాయణ తెలిపారు.

## యువకుడు అదృశ్యం

ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలం బాపునగర్ గ్రామానికి చెందిన రేపాక హరిబాబు(22) అనే యువకుడు అదృశ్యమైనట్లు అతని తల్లి రేపాక పుష్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరిబాబు ఒక ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నాడు. ఈ నెల 3వ తేది హరిబాబు మద్యం సేవించి ఇంటికి రావడంతో తల్లి అతడిని మందలించింది. మరుసటి రోజు తన స్కూటీ పై పని నిమిత్తం బయటకు వెళ్లాడు. అయితే రాత్రి అయినా అతను తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు వెతకగా, అతని స్కూటీ నిజామాబాద్ రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో లభ్యమైంది. కానీ హరిబాబు ఆచూకీ మాత్రం లభించలేదు. ఈ క్రమంలో బాధిత తల్లి ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతం



ప్రజాపక్షం/కరీంనగర్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోపాటు తప్పిపోయిన, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పిల్లలను రక్షించాలని ఆడిషినల్ కలెక్టర్ లోకల్ బాడీస్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బాల కార్మికుల నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని అధికారులు అందరూ విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం పై సంబంధిత అధికారులతో అడిషనల్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం జనవరి 1 నుండి జనవరి 31 వరకు వివిధ శాఖల సమన్వయంతో పక్కగా నిర్వహించాలని ఆదేశించారు. పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు లేదా సహాయం అవసరమైన పిల్లలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 1098 కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని అధికారులు సమిష్టిగా విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ ధనలక్ష్మి, ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి సుగుణ, టాస్క్ పోర్స్ ఏసీపీ సతీష్, డీసీపీవో పర్వీన్, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, లేబర్ కమిషనర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్, క్వాలిటీ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా తప్పులను సరిదిద్దాలని బిజెపి నేతల ఫిర్యాదు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ నగరపాలక సంస్థ 7, 36, 51, 64 డివిజన్ ల ఓటరు జాబితాలో అనేక తప్పిదాలు, పొరపాట్లు , అవకతవకలు జరిగాయని, తక్షణం ఓటర్ లిస్టు సవరణ చేయాలని ఆయా డివిజన్ల బిజెపి నేతలు, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు తోట సాగర్, తోట అనిల్, కొమ్మెర రవీందర్ రెడ్డి, బండారి ఆంజనేయులు, శాన గోండ శ్రీనివాస్ (వాసు) లు సోమవారం రోజున జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. ఏడవ డివిజన్ హౌసింగ్ బోర్డు, సదాశివ పల్లి కలిపి గతంలో 5207 ఓట్లు ఉంటే తాజాగా ప్రకటించిన ముసాయిదాలో ఓటర్ల సంఖ్య 6846 కి చేరిందని, దాదాపు 1279 మంది ఓట్లు కరీంనగర్ పట్టణంలోని లోని వివిధ ప్రాంతాల నుండి నమోదు అయ్యాయని, డివిజన్ కు సంబంధంలేని పోలింగ్ బూతు కేంద్రాల నుండి ఆ ఓట్లు ఏడో డివిజన్లో నమోదు అయ్యాయని, అలాగే అనేక బోగస్ ఓట్లు కూడా డివిజన్ లో నమోదు అయ్యాయని, తక్షణం ఈ విషయంపై చర్యలు తీసుకొని, ఓటర్ జాబితాను సవరించాలని కంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ సోమవారం రోజున జిల్లా కలెక్టర్కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసి వినతి పత్రం సమర్పించారు. 51 డివిజన్లో మాజీ కార్పొరేటర్ ఇంటి నంబరు 37329, 322, 293 ల పై 42 అక్రమ ఓట్లు నమోదయాయని, అలాగే డివిజన్ మొత్తంగా 400 ఓట్లు నమోదు అయ్యాయని , వెంటనే ఆ ఓట్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని బిజెపి నేతలు కొమ్మెర రవీందర్ రెడ్డి, బండారి ఆంజనేయులు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. గతంలో 60 వడివిజన్ నేడు 64వ డివిజన్ అయిందనీ ,అయితే ప్రస్తుత 64వ డివిజన్ లో ఓటర్ జాబితాలో అనేక పొరపాట్లు, తప్పిదాలు జరిగాయని, 64 డివిజన్ ఓటర్ జాబితాను సవరించడానికి తగిన చర్యలు చేపట్టాలని వాసు అధికారులను కోరారు.

## రూ 9.97 కోట్లతో నిజాంసాగర్ వద్ద ఎకో టూరిజం అభివృద్ధి



ప్రజాపక్షం/నిజాంసాగర్: కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం శసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అడిగిన ప రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. స్వదేశ్ దర్శన్ 2.0 లోని సీబీడీడీ ఉప పథకం కింద 2025 సం.లో రూ 9.97 కోట్లతో ఏకో టూరిజం పనులు చేపట్టినట్లు చెప్పారు. పర్యాటకుల సౌకర్యార్థం ల్యాండ్ స్కేపింగ్, పాదచారుల మార్గాలు, ఇతర ప్రాథమిక మౌలిక సధుపాయాల పనులు ప్రస్థుతం పురోగతిలో ఉన్నాయని చెప్పారు.

**కౌలాస్ కోట అభివృద్ధిపై అధ్యాయనం**

కౌలాస్ కోట చారిత్ర, సాంస్కృతిక, పర్యావరణ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, వీటిని ఏకీకృత పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు 202526 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి వివరణాత్మక సాధ్యాసాధ్యాల అధ్యాయనం చేపట్టాలని ప్రభుత్వం ప్రతి పాదించినట్లు తెలిపారు. పురావస్తు శాఖ పరిధిలోని చారిత్రక కౌలాస్ కోట సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి చెప్పారు. ఇప్పటికే 13వ ఆర్థిక సంఘం నిధులతో రూ 50 లక్షల అంచనా వ్యయంతో కొన్ని సంరక్షణ పనులు చేపట్టామని, కోటను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు 5 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర ప రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన సభకు తెలియజేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తపరిచారు.

## మోడల్ స్కూల్‌లో మోడల్ పోలింగ్

ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలంలోని మల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు మోడల్ పోలింగ్ నిర్వహించారు. అసలు ఎన్నికలను తలపించేలా ఓటర్ల జాబితా, బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యార్థుల చేత ఓటు వేయించారు. ఈ సందర్భంగా నిజాంసాగర్ ఎంపీడీఓ డి.శివకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని, నైతిక విలువలు కలిగి ఉండాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు వై.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే ఓటు హక్కు ప్రాముఖ్యతను ఎన్నికల ప్రక్రియను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జాబితాలో తప్పులుంటే రాత-పూర్వకంగా దరఖాస్తు చేయాలి

ప్రజాపక్షం/బోధన్: ఓటరు జాబితాలో ఎవైనా తప్పులు ఉంటే రాతపూర్వకంగా దరఖాస్తు అందచేయాలని పార్టీల నాయకులకు మున్సిపల్ కమీషన్ జాదవ్ కృష్ణ అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అన్నీ పార్టీల నాయకులతో మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఓటరు జాబితాలోని సమస్యలపై చర్చించారు. పలు పార్టీల నాయకులు ఓటరు జాబితాలోని సమస్యలను మున్సిపల్ కమీషనర్ దృష్టికి తెచ్చారు. ఓటరు జాబితాలో మార్పులు చేయాలని కోరారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలను మార్చే అధికారం మాకు లేదని, తప్పులుంటే రాతపూర్వకంగా దరఖాస్తులు చేయాలన్నారు. అవగాహన లేకుండా సమావేశాలు ఎందుకు నిర్వహించారంటూ పార్టీల నాయకులు రవీందర్ యాదవ్, గోపి, కిషన్ లతో పాటు మరికొంతమంది మున్సిపల్ కమీషనర్ పై మండిపడ్డారు.

## మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయిన మహిళపై కేసు నమోదు

ప్రజాపక్షం/నిజామాబాద్ : మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ధర్పల్లి మండలం దుబ్బాకలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకోగా దుబ్బాకకు చెందిన ఫిర్యాదుదారుడు పోతుగంటి గంగారాం తెలిపిన వివరాల ప్రకారం మేనత్త మల్కవ్వ ఇంటి బయట ఉండగా గుర్తు తెలియని మహిళ బొట్టుబిల్లలు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకోవడానికి వచ్చిన మహిళ ఒంటరిగా ఉన్న మల్కవ్వ వద్దకు వెళ్లి మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయిందని ఫిర్యాదుదారుడు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## సర్పంచ్‌ను సన్మానించిన ఐకెపి మహిళలు

ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ : మండలంలోని మెండోరా గ్రామసర్పంచ్, ఉపసర్పంచ్‌గా గెలుపొందిన కుంట లక్ష్మి , రమేష్ దంపతులను సోమవారం మండల ఐకెపి సిసిలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, ఐకెపి గ్రామ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంట లక్షీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ఎల్లవేళలా మా వంతు సహకారమందిస్తామని చెప్పారు. మహిళలకు అవకాశం కల్పించిన సిఎంకు అవకాశమిచ్చిన నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థికి ఎన్ఎస్ఎస్ ప్రశంస పత్రం అందజేత

ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్ రూరల్ పరిధిలోని నగునూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల నగునూర్ విధ్యార్థికి ఎన్ఎస్ఎస్ ప్రశంస పత్రాన్ని అందజేశారు. శాతవాహన విశ్వవిద్యాలయం జాతీయ సేవా సంస్థ కోఆర్డినేటర్ డా.మనోహర్ ప్రశంసపత్రం అందజేశారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న మోర్లె పావని డిసెంబర్ 27 నుంచి 28 వరకు హైదరాబాదులోని దుండిగల్ లో గల ఎంఎల్ఆర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్‌లో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా విధ్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ డా.టి.మాలతి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.పద్మజ, జాతీయ సేవాసంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.గీతారాణి, అభినందించారు.

# ఉపాధి కోర్సులపై అవగాహన సదస్సు: కలెక్టర్

ప్రజాపక్షం/పెద్దపల్లి: జిల్లాలోని నిరుద్యోగ యువతీ,యువకులకు 100% జాబ్ గ్యారెంటీతో అందించే వివిధ ఉపాధి కోర్సుల గురించి జనవరి 7న సమీకృత జిల్లా కలెక్టరేట్లో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా నైపుణ్య శిక్షణతో పాటు 100% జాబ్ గ్యారంటీ తో ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం, ఎల్.ఎస్.సి & రెడింగటన్ ఆధ్వర్యంలో స్కిల్ ఇండియా సర్టిఫికేషన్ తో ఉపాధి కోర్సులు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.10వ తరగతి, ఇంటర్ పాసైన అభ్యర్థులకు రియల్ టైం ఫార్క్ లిఫ్ట్ ఆపరేటర్ అనే 38 రోజుల వ్యవధి గల కోర్సు, ఇంటర్ ఉత్తీర్ణత తో ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులకు 53 రోజుల విభక్తి గల సప్లై అసోసియేట్ కోర్సు ఉచితంగా అందించడం జరుగుతుందని, కోర్స్ తో పాటు ఉచిత భోజన వసతి సౌకర్యం, పరిశ్రమల పరిశీలన, స్కిల్ ఇండియా సర్టిఫికెట్, 100% జాబ్ గ్యారెంటీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.19 నుంచి 28 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు వార్షిక ఆదాయం మూడు లక్షల లోపు ఉన్న వారందరూ ఉచిత శిక్షణ కోర్సు కు హాజరు కావచ్చని, జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## పొగమంచులో మోర్తాడ్




ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం తెల్లవారు జామున గ్రామంలో పొగమంచు ఏర్పడటంతో ప్రజలు చలికి గజగజా వణికి పోతున్నారు. అలాగే జాతీయ రహదారిపై తెల్లవారు జామున చలిగాలులతో పాటు దట్టమైన పొగమంచు ఉండటంతో జాతీయ రహదారిపై మెట్పల్లి వైపు నుంచి నిజామాబాద్ వైపు, నిజామాబాద్ వైపు నుంచి మెట్పల్లి వైపుకు వెళ్లే వాహనాలు పొగమంచు వల్ల హెడ్లైట్ల సహాయంతో రాకపోకలు సాగించినప్పటికీ కొంత ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్లో పొగమంచు కమ్ముకోవడం వల్ల ప్రయాణికులు సైతం చలికి గజగజ వణికిపోయారు. దీంతో ప్రజలు ఇంకా ముందు ముందు కూడా చలిగాలులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని ప్రజాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై పొగమంచు కమ్ముకొన్న చిత్రాన్ని మోర్తాడ్ ప్రజాపక్షం రిపోర్టర్ ఉదయం ఐదు గంటలకు తన కెమెరాలో బంధించారు. ఏది ఏమైనా ఆకాశం నుంచి దట్టమైన పొగమంచు కురియడంతో ఉదయం పూట వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు గాని వివిధ గ్రామాలకు ఉద్యోగంపై వె ళ్లే ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పలువురు పొగమంచుతో ఇబ్బందులు పడ్డారని స్థానిక ప్రజలు తెలిపారు.

## స్మార్ట్ సిటీగా గుర్తింపునకు పార్టీలకతీతంగా పనిచేద్దాం

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే స్మార్ట్ సిటీగా మార్చాలని దానికోసం పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ చొరవ తీసుకోవాలని, పార్టీలకు అతీతంగా అందరు కలిసి పనిచేద్దామని నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ ఛైర్మన్ కేశవేణు అన్నారు. సోమవారం పెన్షనర్స్ భవనంలో నిజామాబాద్లోని ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటి తయారుచేసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేశ వేణు మాట్లాడుతూ ఒకప్పుడు నిజామాబాద్ జిల్లాకు కరీంనగర్, నాందేడ్ జిల్లాల నుండి కొనుగోలుకు వచ్చే పరిస్థితి ఉండేది. కానీ ఈరోజు ఆ రెండు జిల్లాలు నిజామాబాద్ కన్నా అభివృద్ధిలో ముందున్నాయని, నిజామాబాద్ జిల్లా వెనక పడడానికి గత పాలకులే కారణమన్నారు. నిజామాబాద్ నగరంలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, వీది దీపాలు ఏర్పాటుకు నుడా పరిధిలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటి ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావు, నాయకులు హుస్సేన్, మల్లేష్ రెడ్డి భరద్వాజ, భూపతిరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫోటో : 05ఎన్‌జడ్‌బియు02

## ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందేలా కృషి



ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లాలోని రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్యారోగ్య శాఖ పని తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య కొంత తగ్గిందని, ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు.ఏ.ఎన్.ఏం రిజిస్ట్రేషన్ నుంచి టీకాలు వేయించడం, రెగ్యులర్ చెకప్, ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే లోపం ఉండాలని కలెక్టర్ తెలిపారు. ప్రసవం తర్వాత కూడా బాలింత,శిశువు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రెగ్యులర్ ఫాలో అప్ చేయాలని అన్నారు.ఆర్.బీ.ఎస్.కే బృందాలు రెగ్యులర్ గా ప్రభుత్వ స్కూల్స్ ను తనిఖీ చేస్తూ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆర్.బి.ఎస్.కే బృందాలు సందర్శించినట్లుగా పాఠశాలల కు సర్టిఫికెట్ జారీ చేయాలని, సదరు వివరాలు ఆన్ లైన్ లో నమోదు జరిగేలా విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్.సి.డీ సర్వే 82% జరిగిందని ఆ వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ టీబీ వ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఆరోగ్యశాఖ అధికారి వాణిశ్రీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులను దూషించే నైతిక హక్కు కెటిఆర్‌కు లేదు



ప్రజాపక్షం/నిజామాబాద్: కేటీఆర్‌కు సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసే స్థాయి లేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులను దూషించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని, తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు నగేష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డిలపై విమర్శలు చేసే, దూషించే హక్కు లేదన్నారు. సిఎం స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డిని కేటీఆర్ అవమానించటమంటే అది కేటీఆర్ అవివేకానికి, అహంకారానికి నిదర్శనమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదని కేటీఆర్ అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని, ఇది సరి కాదన్నారు.కేటీఆర్ కేవలం అహంకార ధోరణితో మాత్రమే ఆలోచిస్తున్నాడని, మరోకసారి కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే టీఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీస్తామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, రాజారెడ్డి, సంతోష్, జావిద్ అక్రమ్, వేణురాజ్, యాదగిరి, నర్సారెడ్డి, రాజేందర్, శోభన్, కౌశిక్, గంగారెడ్డి, గణేష్, నాగేష్ పాల్గొన్నారు.

## కొండగట్టు గిరి ప్రదక్షణ నివేదిక పంపాలని కోరిన పవన్ కళ్యాణ్



ప్రజాపక్షం/కరీంనగర్: చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం కు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోన్ చేసినట్లు మేడిపల్లి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొండగట్టు లో పర్యటించిన పవన్ కళ్యాణ్ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. టీటీడీ నిధులతో హనుమాన్ మాల విరమణ మండపం, వాయుపుత్ర సదన్ వసతి గృహాలకు ఆయన భూమి పూజ చేశారు. కొండగట్టు పర్యటనలో పవన్ కళ్యాణ్ దృష్టికి కొండగట్టు గిరి ప్రదక్షిణ అంశాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తీసుకువెళ్లారు. గిరిప్రదక్షిణలో నిత్యం వేలాది మంది భక్తులు పాల్గొంటున్నారని, దానిపైన కూడా దృష్టి పెడితే బాగుంటుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను కోరారు. దీంతో సభ వేదిక పైనే గిరిప్రదక్షిణకు తప్పకుండా సహాయం చేస్తానని, అవసరమైతే కరసేవ కూడా చేస్తానంటూ ఆయన ప్రకటించారు. కొండగట్టు నుంచి పవన్ కళ్యాణ్ వెళ్లి 48 గంటలు కాకముందే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు పవన్ కళ్యాణ్ ఫోన్ చేసి గిరిప్రదక్షిణ అంశాన్ని ప్రస్తావించి వివరాలు పంపాల్సిందిగా కోరినట్లు ఆయన పేర్కొన్నారు. తన పర్యటనను విజయవంతం కావడానికి కృషి చేసిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఫోన్ చేయటంతో హుటాహుటిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు ఫోన్ చేశారు. గిరిప్రదక్షణ సర్వే రిపోర్టు తయారు చేయాల్సిందిగా కలెక్టర్ ను సత్యం కోరారు. సత్యం కోరిన వెంటనే రెవెన్యూ, ఫారెస్ట్, ఎండోమెంట్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కొండగట్టు గిరిప్రదక్షిణ ప్రాంతాన్ని సర్వే చేశారు. త్వరలో పూర్తిస్థాయి నివేదిక రూపొందించి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ద్వారా పవన్ కళ్యాణ్ కు అందించబోతున్నారు. కొండగట్టు గిరిప్రదక్షిణ రహదారి, పార్కింగ్ సదుపాయం, తాగునీరు వాష్రూమ్స్ ఏర్పాటు చేయబోతున్నారు. గిరిప్రదక్షిణ ప్రాంతంలో హనుమాన్ కు సంబంధించిన భక్తి పాటలతో మ్యూజిక్ సిస్టం కూడా ఏర్పాటు చేయబోతున్నారు. కొండగట్టు పై పవన్ కళ్యాణ్ దృష్టి పెట్టడం పట్ల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు..త్వరలోనే నివేదిక పవన్ కళ్యాణ్ కు అందజేస్తామని సత్యం అన్నారు.

## నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

ప్రజాపక్షం/ఎడపల్లి: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఎడపల్లి మండల కేంద్రంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక జడ్పీ హై స్కూల్ తెలుగు మీడియం, శ్రీ మాధవి పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమాలకు రవాణా శాఖ, పోలీసు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బోధన్ ఆర్టీవో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిబంధనల అతిక్రమణ వల్లనే మేజార్టీ ప్రమాదాలు జరుగుతున్నాయని, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా వీటిపై అవగాహన కల్పించాలని కోరారు. ఎడపల్లి ఎస్సై రమ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రోడ్డు భద్రతలోని కీలక అంశాలను వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం ప్రాణవాయువుతో సమానమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హై స్కూల్ హెడ్మాస్టర్ రవి కుమార్, శ్రీ మాధవి పాఠశాల కరస్పాండెంట్ మాధవి, సురేష్ గౌడ్, రవాణా శాఖ, పోలీస్ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రాణాపాయం

ప్రజాపక్షం/ఎడపల్లి: వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఒక రైతు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఘటన ఎడపల్లి మండలం ఠానాకలాన్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కేజీవీల్స్‌తో పొలం పనులు చేస్తున్న తరుణంలో అదుపు తప్పిన ట్రాక్టర్ రైతుపైకి దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. దొనకంటి గంగారాం అనే రైతు తన పొలంలో ట్రాక్టర్‌కు కేజీవీల్స్ అమర్చి దుక్కి దున్నుతున్నాడు. మధ్యాహ్నం సమయంలో భోజనం చేయడం కోసం ట్రాక్టర్‌ను పొలంలోని ఒక ఎత్తు భాగంలో నిలిపి వేసి కిందకు దిగాడు. అయితే అనూహ్యంగా ట్రాక్టర్ ఒక్కసారిగా కిందికి దూసుకొచ్చింది. గమనించిన గంగారాం తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ, ట్రాక్టర్ ఎడమ కాలిపైకి ఎక్కడంతో కాలు తీవ్రంగా నలిగిపోయి రక్తస్రావమైంది. ప్రమాదాన్ని గమనించిన తోటి రైతులు వెంటనే 108సమాచారం అందించారు. పోతంగల్ క్లస్టర్‌కు చెందిన 108సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన రైతుకు రక్తస్రావం ఎక్కువగా అవుతుండటంతో ఈఎంటి కె.నారాయణ ప్రాథమిక చికిత్స అందించి రక్తస్రావాన్ని అరికట్టారు. అనంతరం క్షతగాత్రుడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రైతు గంగారాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## మున్సిపల్ స్థానాన్ని ఎస్సిలకు కేటాయించాలి

ప్రజాపక్షం/ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ అధ్యక్ష స్థానాన్ని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెందోలి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ హెచ్ ఫంక్షన్ హాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి పట్టణంలో గతంలో గ్రామపంచాయతీగా ఉన్న నాటినుండి ఇప్పటివరకు ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించలేదని అన్నారు.ఎస్సీలలో బాగా వెనకబడిన మాదిగ సామాజిక వర్గం నుండి అధ్యక్షులుగా ఉండాల్సిన అవసరాన్ని శ్రీనివాస్ నొక్కిచెప్పారు. ఈ విషయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ చూపాలని శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రాయిల్ల రవి కుమార్, మహేష్, రాజేష్,ఆశు పాల్గొన్నారు.

## రోడ్డుపై వరదల ప్రవహిస్తున్న మిషన్ భగీరథ నీరు

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోదూరు గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ పైప్ లైన్ లీకేజీ తో రోడ్డుపై నీరు వరదల పారుతుంది. గత మూడు నాలుగు రోజుల నుండి మిషన్ భగీరథ నీరు రోడ్డుపై వరదల పారుతుండడంతో అటువైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీ పడిన చోట మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన త్రాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి



**ప్రజాపక్షం/కౌటాల :**విద్యార్థులు పరీక్షలలో మరింత రాణించేందుకు వారిని సన్నద్ధం చేయాలని అదనపు కలెక్టర్, ఇంఛార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారీ సూచించారు. సోమవారం మండలంలోని బొదంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్యామ్ మోడల్ ప్రైవేట్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, రికార్డులు, విద్య బోధన సామర్థ్యాలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులను ఎస్ఎ 1 పరీక్ష ప్రశ్నలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులు వి. అరుణ్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కోట ప్రసాద్, మండల విద్యాధికారి గావుడే హన్మంతు, సెక్రటరీ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గాయకుడు కొసంకార్ అనిల్‌కు గద్దర్ అవార్డు

**ప్రజాపక్షం/కౌటాల:**మండలంలోని మొగడ్ దగడ్ గ్రామానికి చెందిన గాయకుడు కొసంకార్ అనిల్ కు గద్దర్ మెమోరియల్ అవార్డు లభించింది. మోక్షిత డాన్స్ అకాడమీ సేవా సమితి ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీన కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్ నగర్ లోని ఎస్‌పిఎం క్రీడా మైదానంలో నిర్వహించిన నూతన సంవత్సర సాంస్కృతిక వేడుకల్లో ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంస్కృతిక సారథి చైర్పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల, సిర్పూర్ ఎంఎల్ఎ డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుహాసిని శెట్టి, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకులు నాగరాజు, అంజన్న, ఎల్లన్న, వెంకటేశం, మోక్షిత డాన్స్ మాస్టర్ సంతోష్, విజయ్ కార్తీక్, ధర్మ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర కీలకం

**ప్రజాపక్షం/ జన్నారం:**ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు ఎంతో కీలకమని జన్నారం ఇంఛార్జి తహసీల్దార్ ఎన్. రామ్మోహన్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ 'ప్రజాపక్షం' దిన పత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం అని, సమాజంలోని వివిధ అంశాలపై వార్తలు, విశ్లేషణలు అందిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తాయని తెలిపారు.ప్రభుత్వ కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ అవినీతి, అక్రమాలను ఎత్తి చూపుతాయని పేర్కొన్నారు. పత్రికలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. మండల సమస్యలపై నిరంతరం 'ప్రజాపక్షం' కథనాలను ప్రచురించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం విలేకరులు శంకర్, యశోద భాస్కర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రక్షణతో కూడిన ఉత్పాదకత సాధించాలి

### ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :**సింగరేణి సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులలో ఐదేళ్ల లోపు అనుభవం ఉన్న జనరల్ అసిస్టెంట్లు, బదిలీ వర్కర్లకు ఇంప్లిమెంటేషన్ ఆఫ్ సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అంశంపై సోమవారం రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తమ పనిని నిర్వర్తించే ప్రతి దశలో జాగ్రత్తగా వ్యవహరించి రక్షణతో కూడిన ఉత్పాదకత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. రక్షణ చర్యలను ఎల్లప్పుడూ గుర్తుంచుకొని పని చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు ఉద్యోగులకు తమ పనిలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. రక్షణే ప్రథమం రక్షణ ఎల్లప్పుడూ అనే నినాదంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ శిబిరం ఈ నెల 5వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు పది బ్యాచ్ లుగా నిర్వహిస్తున్నట్లు, ప్రతి బ్యాచ్ కు రెండు రోజులు శిక్షణ ఉంటుందని, సుమారు 50 మంది ఉద్యోగులు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్, ఎస్ ఓ టు జిఎం ఎన్ సత్యనారాయణ, గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమరయ్య, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ కమ్రుద్దీన్, సిమ్ టార్ డిజిఎం విజయ కుమార్ పాల్గొన్నారు.

# భూమి పేరుతో రూ.20 లక్షల మోసం

### ఇంటి ముందు టెంట్ వేసి బాధితుల ధర్నా




**ప్రజాపక్షం/కాసిపేట:**భూమి ఇస్తామని చెప్పి రూ.20 లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో బాధితులు ఆందోళన చేపట్టారు. మంచిర్యాల ఎంసిసి శ్రీనివాస కాలనీకి చెందిన చీపిరిశెట్టి సుధాకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దేవాపూర్‌కు చెందిన సీపతి రంజిత్ కుమార్ ఇంటి ముందు టెంట్ వేసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020లో శ్రీనివాస గార్డెన్ వద్ద భూమి అమ్ముతామని చెప్పి రంజిత్ కుమార్ రూ.20 లక్షలు తీసుకున్నారని తెలిపారు. భూమి ఇవ్వకపోగా డబ్బులు తిరిగి అడిగితే ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. సింగరేణిలో పదవీ విరమణ పొందిన అనంతరం వచ్చిన డబ్బులను పిల్లల భవిష్యత్తు కోసం భూమి కొనుగోలుకు వెచ్చించామని, ఇప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. డబ్బులు తీసుకున్నట్లు రాసిచ్చిన పత్రాలు, ఒప్పంద పత్రాలను మీడియాకు చూపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం కాసిపేట ప్రెస్ క్లబ్ లో వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బాధితులు అనసూర్య, కుటుంబ సభ్యులు కొండ వెంకటేష్, శృతి పాల్గొన్నారు.

# సింగరేణి గనులను ప్రైవేటీకరణ నుంచి కాపాడాలి



**ప్రజాపక్షం/ కాసిపేట:**సింగరేణి గనులను ప్రైవేటీకరణ నుంచి కాపాడాలని, సింగరేణి బ్లాకులు సంస్థకే దక్కాలని ఏఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కాసిపేట వన్ ఇంక్లైన్ గనిపై సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో గనిపిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీ నారాయణ అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మిక హక్కులను బలహీనపరుస్తున్న బిజెపి ప్రభుత్వ తీరును విమర్శించారు. ఇప్పటికే కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను ప్రైవేటు సంస్థలకు అప్పగించారని ఆరోపించారు. గోదావరిఖని గనులను మూసివేసి మెగా ఓసీగా మార్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు బావులను జెన్‌కోకు అప్పగించిందని, తాడిచెర్ల 2 గనిని కూడా అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి వేలంపాటలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. కార్మికులపై విధిస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని, సొంతింటి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, చిప్ప నర్సయ్య, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ జంజీరాల రంజిత్ కుమార్, అశోక్, గణేష్, సెగ్గం శంకర్, కిష్టయ్య, ఆవునూరి తిరుపతి, బియ్యాల రాజన్న, ఆంజనేయులు, ఆడెపు రవీందర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప భక్తులకు ముస్లిం మైనార్టీ కమిటీ ఆతిథ్యం



**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్:**రామకృష్ణాపూర్ పట్టణంలోని గణేష్ టెంపుల్ నుండి శబరిమల అయ్యప్ప దర్శనానికి బయలుదేరుతున్న భక్తులకు ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఈద్గా కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో పండ్లు, ఫలహారాలు, వాటర్ బాటిళ్లు అందజేశారు. సోమవారం కులమతాలకు అతీతంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రామకృష్ణాపూర్‌లో హిందూ ముస్లింలు సోదర భావంతో మెలుగుతున్నారని తెలిపారు. అయ్యప్ప స్వాములకు భిక్ష అందిస్తూ వారి మత విశ్వాసాలను గౌరవించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. 41 రోజులుగా కఠోర దీక్ష చేపట్టి శబరిమల వెళ్తున్న స్వాముల ప్రయాణం సాఫీగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు

### మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిషోర్ చంద్ర



**ప్రజాపక్షం/జన్నారం:**వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని మంచిర్యాల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిషోర్ చంద్ర సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవం 2026 సందర్భంగా సోమవారం స్థానిక రాఘవేంద్ర లిటిల్ హన్స్ స్కూల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని, ప్రతిరోజూ బయటికి వెళ్ళేప్పుడు వాహనాల కండిషన్ చూసుకోవాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, దీనివల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులు గుర్తించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, డీన్ హేమలత షిండే, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్చవద్దు



**ప్రజాపక్షం/కెరిమేరి:**ఉపాధి హామీ పథకం పేరు మార్చవద్దని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఏఐసిసి పిలుపు మేరకు ఎంజిఎన్ఆర్ఇజిఎ బచావో ఆందోళన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గోయగం గ్రామ పంచాయతీ పరిధిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ నాయకత్వంలో పేదలకు ఉపాధి కల్పించేందుకు ఈ చట్టాన్ని తీసుకువచ్చి ఈ చట్టానికి మహాత్మా గాంధీ పేరును జోడించి గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం, గ్రామ గణవంటి పేర్లతో పిలవడం మహాత్మా గాంధీని అవమానపర్చడమేనని విమర్శించారు. చట్టం పేరును మార్చకుండా మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోయగం గ్రామ సర్పంచ్ ఆత్రం ఆనందరావు, ఉప సర్పంచ్ మోహార్లే రామదాసు, కార్యకర్త దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



**ప్రజాపక్షం/కాసిపేట:**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని తాటిగూడ సర్పంచ్ మడావి వెంకటేష్ స్పష్టం చేశారు. సోమవారం కాసిపేట మండలం తాటిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సిమెంట్, ఇతర నిర్మాణ సామాగ్రిని సరైన మోతాదులో వినియోగించాలని మేస్త్రీలకు, లబ్ధిదారులకు సూచించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు ప్రభుత్వ నిధులు సకాలంలో అందేలా అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఇసుక కొరత, ఇతర సమస్యలు ఉంటే వెంటనే పంచాయతీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎండాకాలం ముగిసే లోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని తెలిపారు. పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పథకం అమలవుతోందని, గ్రామంలో అర్హులందరికీ ఇల్లు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, కాంగ్రెస్‌నాయకులు చుంచు జనార్ధన్, ముత్యం రాజయ్య, కరోబార్ శ్రావణ్ పాల్గొన్నారు.

## మండల విద్యాధికారికి వినతి పత్రం ఇచ్చిన ఉపాధ్యాయులు

ప్రజాపక్షం/దిలావర్‌పూర్:మండలానికి చెందిన ఉపాధ్యాయులు వేసవిలో జరిగిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన ఈ.ల్.స్.సివ్ సర్వే చేసినటువంటి ఉపాధ్యాయులకు 5 సి.సి.ల్ స్ ను మంజూరు చేయాలని మండల విద్యాధికారి సదానందం కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.దీని పై స్పందిస్తూ విద్యాధికారి వెంటనే మంజూరు చేస్తామని తెలుపడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బైంసా పట్టణంలో వీధి కుక్కల బీభత్సం

### 20కి పైగా మంది పై దాడి

ప్రజాపక్షం/బైంసా:బైంసా పట్టణంలో కుక్కల బీభత్సం సృష్టించాయి పట్టణంలోని బట్టి గల్లి,కద్ద హోటల్ ఏరియాలో తదితర ప్రాంతాలలో 20 మందికి పైగా కుక్కలు దాడి చేశాయి.బైంసా ఏరియా ఆసుపత్రి మొత్తం కుక్కకాటుకు గురై బాధితులతో నిండిపోయింది.అయితే నిమిషం నిమిషానికి బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కలను పట్టుకోవాలని పలువురు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ క్రమంలో వీధి కుక్కలను పట్టుకోవాలని ప్రజలు అడిషనల్ కలెక్టర్ కు సైతం వినతి పత్రం అందించారు.మున్సిపాలిటీ నిర్లక్ష్యంతోనే కుక్కలు రెచ్చిపోతున్నాయని స్థానిక బాధితులు ప్రజలు వాపోతున్నారు.తక్షణమే అధికారులు కుక్కలను తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నట్టల నివారణ మందులు పంపిణీ

ప్రజాపక్షం/ముధోల్:మండలంలోని విట్టోలి గ్రామంలో సోమవారం స్థానిక సర్పంచ్ కాలేవార్ సుచరిత దిగంబర్ ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ వారిచే నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులు ఎలాంటి రోగాలకు బలి కాకుండా ముందు జాగ్రత్తగా నట్టల మందులు వేయించుకోవాలని సూచించారు.ప్రభుత్వం ఈ కార్యక్రమం ఉచితంగా గ్రామగ్రామాన చేస్తున్నందున ప్రతి పశు కాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది రవీందర్,రమేష్,శ్రీనివాస్,బాబు,దత్తు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

ప్రజాపక్షం/నిర్మల్:గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఇలేగాం గ్రామ సర్పంచ్ సిరం రాజమణి శ్రీనివాస్ అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం లోసర్పంచ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. వార్డ్ మెంబర్లు వార్డుల వారిగా సమస్యలు గుర్తించాలన్నారు. ప్రభుత్వ నిధులు రాగానే దశల వారిగా అభివృద్ధి పనులు చెప్పడతామని చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతుగా పాటు పడతానని అందులో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉంటానన్నారు.

## విధి నిర్వహణలో ఉన్న ఎంఇఒపై ఉపాధ్యాయుడి దాడి

### సెల్‌ఫోన్ పగులగొట్టి వీరంగం



ప్రజాపక్షం/ఎడపలి:పాఠశాల తనిఖీకి వెళ్లిన మండల విద్యాధికారిపై ఓ ఉపాధ్యాయుడు చిందులు తొక్కుతూ దాడికి యత్నించిన ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి వడ్డెర కాలనీలో సోమవారం కలకలం రేపింది. గతంలో ఇచ్చిన మెమోను మనస్సులో పెట్టుకొని, విధుల్లో ఉన్న అధికారులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా భౌతిక దాడికి ప్రయత్నించడం విద్యాశాఖలో చర్చనీయాంశమైంది. ఎంఈఓ గాలప్ప తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం కుర్నాపల్లి వడ్డెర కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ గాలప్ప, సీఆర్పీ రాకేష్‌లు కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్ షీట్లను పరిశీలించగా, ఉపాధ్యాయుడు భూపతి రాజు వాటిని కరెక్షన్ చేయలేదని గుర్తించారు. దీనిపై ఎంఈఓ ఆయనను ప్రశ్నించగా భూపతి రాజు ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై దురుసుగా ప్రవర్తించారు. ప్రశ్నించినందుకు అసహనం వ్యక్తం చేసిన ఉపాధ్యాయుడు విద్యార్థుల నోటు పుస్తకాలను విసిరికొట్టడమే కాకుండా ఎంఈఓ చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కొని పగులగొట్టారు. ఈ దారుణాన్ని వీడియో తీసేందుకు ప్రయత్నించిన సీఆర్పీ రాకేష్ ఫోన్ ను కూడా లాక్కొని దుర్భాషలాడారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే మీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతాను అంటూ అధికారులను బహిరంగంగా బెదిరించడం గమనార్హం. ఉపాధ్యాయుడు భూపతి రాజు గతంలో పాఠశాల విధులకు తరచూ ఆలస్యంగా హాజరయ్యేవాడని, దీనిపై డీఈఓకు నివేదిక సమర్పించడంతో ఆయనకు మెమో జారీ అయ్యిందని ఎంఈఓ తెలిపారు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకునే ఉద్దేశపూర్వకంగానే తమపై బూతు పురాణం విప్పుతూ, దాడికి ప్రయత్నించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించి, అధికారులను భయభ్రాంతులకు గురి చేసిన ఉపాధ్యాయుడు భూపతి రాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంఈఓ గాలప్ప పేర్కొన్నారు. ఈ మేరకు ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో సదరు ఉపాధ్యాయునిపై ఎంఈఓ గాలప్ప, సీఆర్పీ రాకేష్‌లు ఫిర్యాదు చేశారు.

## అందుబాటులో రైతుల అవసరం మేర ఎరువులు

### వ్యవసాయ శాఖ అధికారి హరీష్ కుమార్



ప్రజాపక్షం/మోర్తాడ్:మోర్తాడ్ మండలంలో రైతులకు అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని మోర్తాడ్ మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్ కుమార్ అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్, పాలెం, మోర్తాడ్, దొన్‌పాల్ గ్రామాలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో యూరియా ఎరువులను ఏవో హరీష్ కుమార్ పరిశీలించారు. అనంతరం ఏవో హరీష్ కుమార్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు మండలానికి 1920 మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందన్నారు. ప్రస్తుతం మండలంలో 225మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా అవసరం ఉన్న రైతులు తీసుకోవచ్చని సూచించారు. మండలంలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది దిలీప్, రైతులు పాల్గొన్నారు.

## అందరం కలిసికట్టుగా పని చేద్దాం : వేముల



ప్రజాపక్షం/భీమ్‌గల్: గడిచిన పదేళ్లలో భీమ్‌గల్‌ను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలకు ఓట్లు అడిగే అర్హత ఒక్క బీఆర్‌ఎస్ పార్టీకే ఉందని వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్‌లో ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన భీమ్‌గల్ మున్సిపాలిటీ ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే వేముల పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులందరం ఎలాంటి భేషజాలు లేకుండా కలిసికట్టుగా పని చేసి మరోకసారి భీమ్‌గల్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. భీమ్‌గల్ గ్రామపంచాయతీగా ఉంటే నిధులు తక్కువగా ఉంటాయని, పెద్దలు సలహాలు, సూచనల మేరకు భీమ్‌గల్‌ను మున్సిపాలిటీ చేసుకోవటం జరిగిందని, ప్రజల ఆశీర్వాదంతో నేను ఎమ్మెల్యేగా గెలిచిన మొదటిసారి 2016లోనే భీమ్‌గల్ ప్రతి గల్లీ గల్లీ తిరిగిన భీమ్‌గల్ పరిస్థితి చాలా దారుణంగా ఉండే భీమ్‌గల్ అభివృద్ధి కోసం ప్రణాళిక తయారు చేసుకోవటం జరిగిందని 25 కోట్లు అవసరమయ్యాయని, కేసీఆర్ సహకారంతో 25 కోట్లు మంజూరు చేయించుకుని భీమ్‌గల్ ఇంటర్నల్ రోడ్లు అభివృద్ధి చేసుకున్నామని, తర్వాత మెయిన్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు మార్చుకోవటం జరిగిందన్నారు. మహిళలకు 2500 లేదు, ఆసరా పెన్షన్ 4000 చేయలేదు, ఇలా ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేదని భీమ్‌గల్‌లో రెండేళ్లలో ఎక్కడ తట్టెడు మట్టి తీయలేదని, 100 పడకల ఆస్పత్రి, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు పనులు ఆగిపోయాయని ఇప్పుడు మంత్రిని తీసుకువచ్చి పాత సాంక్షన్ పనులకు కొబ్బరికాయ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు కాంగ్రెస్‌పై కోపంతో ఉన్నారని, ఎన్నికలు వచ్చినప్పుడు కర్రుకాల్చివాత పెట్టడం ఖాయమన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనం కేటాయించాలి

ప్రజాపక్షం/నస్పూర్:మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నూతనంగా ఏర్పాటు చేయాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి కోరారు. సోమవారం నస్పూర్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1967లో ప్రారంభం కాగా ప్రస్తుత భవనం 1978లో పూర్తయిందని, ప్రస్తుతం కళాశాలలో 450 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. హాస్టల్స్ దూరంగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 50 ఏళ్లు పూర్తి చేసుకున్న కళాశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపడం లేదని, తరగతి గదులు సరిపోక నూతన కోర్సులు ప్రారంభించలేకపోతున్నారని, పాత తరగతి గదుల్లో పైకప్పు పెచ్చులు ఊడుతుండడంతో క్లాసులు నిర్వహించలేకపోతున్నారని, వెంటనే నూతన భవనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## టాస్క్ ఆధ్వర్యంలో మహీంద్రా ప్రైడ్ శిక్షణ తరగతులు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ పట్టణంలోని దీక్ష డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో ఈనెల 5నుండి ఆరు రోజులపాటు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మహేంద్ర ప్రైడ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తుందని టాస్క్ ట్రైనర్ యం.మహిపాల్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో జీవన నైపుణ్యాలు,కరుణ గౌరవం,బాధ్యత,ప్రపంచ పౌరసత్వం,సాఫ్ట్ స్కిల్స్ గ్రూమింగ్,కమ్యూనికేషన్ స్కిల్స్ ఇంగ్లీష్ మాట్లాడటంలో మెళకువలు,స్థానిక భాషలో స్పష్టత,ఇంటర్వ్యూ నైపుణ్యాలు డిజిటల్ లిటరసీ అండ్ ఆప్టిట్యూడ్,కంప్యూటర్ పరిజ్ఞానం,గణిత సామర్థ్యం వాటిలో శిక్షణ ఇచ్చి,ఈ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందించబడుతుందని,ఈ సర్టిఫికెట్ కు వివిధ ఉద్యోగాలలో ప్రాముఖ్యత ఇవ్వబడుతుందని,విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు.ఈ కార్యక్రమంలో దీక్ష డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ సిహెచ్.వెంకట్ రెడ్డి,ప్రిన్సిపల్ మెంగా,శ్రీధర్,టాస్క్ కోఆర్డినేటర్ ఎన్.లక్ష్మణ్ పాల్గొన్నారు.

## జ్ఞానార్జనే లక్ష్యంగా చదవాలి త్రిదండి రామానుజ స్వామి

ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:ఆదర్శ నగర్‌లోని స్థానిక వశిష్ట హై స్కూల్‌లో రాష్ట్ర ప్రజ్ఞ వికాస్‌ట్రస్టు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల కోసం సోమవారం నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన త్రిదండి దేవనాథ రామానుజ స్వామి మాట్లాడుతూ,సంపాదన కోసమే కాకుండా జ్ఞానం కోసం మరింత నేర్చుకోవాలన్న తపనతో విద్యను అభ్యసించాలని సూచించారు.విద్యార్థులు తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని క్రమశిక్షణతో కష్టపడి చదివితే తప్పకుండా విజయాలను సాధిస్తారని తెలిపారు.ఆత్మవిశ్వాసం,పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రస్టు గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు,ట్రస్టు నిర్మల్ జిల్లా అధ్యక్షుడు,వశిష్ట పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్,సెక్రెటరీ పడాల ప్రభాకర్,నిర్మల్ టౌన్ ప్రెసిడెంట్ అయ్యనగరి శ్రీధర్,శ్యామ్ ప్రకాష్,స్టేట్ ఈసీ మెంబర్ షబ్బీర్,రాజు,మల్లేష్,పాఠశాల ప్రిన్సిపాల్ గొల్లపల్లి మాధవి,ఉపాధ్యాయులు,వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/దండేపల్లి:దండేపల్లి మండలం ద్వారక గ్రామానికి చెందిన తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసిన కుల పెద్దలపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మునిమడుగు గంగన్న కోరారు. సోమవారం దండేపల్లి తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు గంగన్న మాట్లాడుతూ 2020లో గ్రామంలో జరిగిన గొడవ కారణంగా కుల పెద్దలు తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని, దీనిపై అప్పట్లోనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందని తెలిపారు. అప్పటి నుంచి కులంలో జరిగే కార్యక్రమాలకు తన కుటుంబాన్ని రానివ్వడం లేదని, ఈ నెల 2న కుల పెద్దలను కలిసి అడగగా, కులంలోకి తీసుకునేది లేదని, దిక్కున్న చోట చెప్పుకోవాలని హెచ్చరించారని వాపోయారు. కుల పెద్దల చర్యలతో తన కుటుంబం మానసిక క్షోభకు గురవుతోందని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే స్పందిస్తూ బాధితుడి వినతి మేరకు తాను, ఎస్ఐ, ఎంపీడీఓలతో కలిసి గ్రామంలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రాజకీయ నాయకులతో మున్సిపల్ కమిషనర్ సమావేశం

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్వరలో జరగబోయే పురపాలక సంఘం 2వ సాధారణ ఎన్నికల సందర్భంగా సోమవారం రోజున మున్సిపల్ కార్యాలయంలో జాతీయ,రాష్ట్ర మరియు గుర్తింపు పొందిన రాజకీయ నాయకులతో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల వార్డుల వారీగా ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ పైన మరియు పోలింగ్ స్టేషన్ల పైన వారి అభిప్రాయాలను స్వీకరించడం జరిగిందని కమిషనర్ తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపుగా అన్ని వార్డుల పోలీస్ స్టేషన్లు ఇదివరకు ఉన్న స్థానల్లోనే నిర్వహించడం జరుగుతుందని ఎక్కువ ఓటర్లు వచ్చిన 11వ వార్డులో అదనంగా ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే ఓటర్లకు అనుగుణంగా 5వ పోలీగ్ స్టేషన్ ఇండియన్ మిషన్ సెకండరీ స్కూల్ మరియు 14 వ వార్డు పోలింగ్ స్టేషన్ తెలుగువాడ ప్రభుత్వ పాఠశాలకు మార్చడం జరిగిందని, మున్సిపల్ పరిధిలో 36 వార్డుల వారీగా మ్యాపింగ్ చేసిన 43,845 ఓటర్లకు గాను 54 అభ్యంతరాలు రావడం జరిగిందని, వాటిని కూడ పరిశీలించడం జరుగుతుందని అలాగే 43,845 ఓటర్లలో 100 నుండి 200 ఓటర్ల వరకు వార్డుల వారీగా పొరపాట్లు ఉన్నాయని మా దృష్టికి రావడం జరిగిందని వాటిని కూడా పరిశీలించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో



పాల్గొన్న రాజకీయ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్,వినయ్, కిరణ్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి సహకరించండి

ప్రజాపక్షం/ఎడపల్లి: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం పాఠశాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు తోడ్పాటు అందించాలని పోచారం గ్రామ జడ్పీ హై స్కూల్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.రమాదేవి కోరారు. సోమవారం ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచి, ఉప సర్పంచి, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి నీరడి జ్యోతి, ఉప సర్పంచి జక్కు రజితతో పాటు ఎనిమిది మంది వార్డు సభ్యులను పాఠశాల సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సురేష్ బాబు, నరేందర్, సాయిరెడ్డి, నరసింహమూర్తి, అనిత, సుజాత, జ్యోతి, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సమ్మక్క–సారలమ్మ జాతర దుకాణాల వేలం నిర్వహణ



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్,కొదురుపాక గ్రామాల మధ్య జరగనున్న సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు ఊపందుకున్నాయి. జాతరలో భక్తులకు అవసరమైన వివిధ దుకాణాల నిర్వహణ కోసం నారాయణపూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ వేలం నిర్వహించారు. వ్యాపారులు పోటీపడి పాల్గొన్నారు.వేలం వివరాల ప్రకారం కొబ్బరికాయలు–బెల్లం దుకాణం రూ.73 వేలుకు, తల్లి ఆరాధన (కోళ్ల) విభాగం రూ.34 వేలుకు, లడ్డు–పులిహోర దుకాణం రూ.33 వేలుకు, తలనీలాల విభాగం రూ.33 వేలుకు, శీతల పానీయాల దుకాణం అత్యధికంగా రూ.1 లక్షా 80 వేలుకు దక్కినట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం మీద ఈ వేలం ద్వారా రూ.3 లక్షల 53 వేల ఆదాయం సమకూరింది.ఈ కార్యక్రమంలో నారాయణపూర్ సర్పంచ్ గుడుగుల సతీష్,కొదురుపాక సర్పంచ్ ఉత్తం కుమారి, ఉప సర్పంచ్ రామారావు,ఉపసర్పంచ్ తిరుపతిరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మండల రమేష్, సమ్మక్క–సారలమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ పోల్సాని తిరుపతిరావు, మాజీ సర్పంచ్ సాగర్ రావు, ఎండోమెంట్ శాఖ జూనియర్ అసిస్టెంట్ శేఖర్ వార్డు సభ్యులు కల్లేపల్లి దేవేందర్, మూల హరీష్, రేచవేని శ్రీనివాస్, పొన్నం చంద్రమౌళి గౌడ్, రాజా గౌడ్‌తో పాటు వివిధ గ్రామాల ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.జాతర ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరను విజయవంతం చేయడంలో గ్రామస్తుల సహకారం కీలకమని వారు పేర్కొన్నారు.

## ప్రతిమ హాస్పిటల్ నుండి ప్రతి సోమవారం బస్సు సౌకర్యం

ప్రజాపక్షం/గొల్లపల్లి: గొల్లపల్లి గ్రామ ప్రజల అనారోగ్య సమస్యల చికిత్స కోసం గ్రామ సర్పంచ్ నల్ల నీరజసతీష్ రెడ్డి, ఉపసర్పంచ్ గురిజెల బుచ్చిరెడ్డి కరీంనగర్ ప్రతిమ హాస్పిటల్ యాజమాన్యం తో మాట్లాడి గొల్లపల్లి కి ఆరోగ్య రథం(బస్సు) ను ఏర్పాటు చేయాలని అడగడంతో ఆసుపత్రి యాజమాన్యం వారు స్పందించి వెంటనే గొల్లపల్లి గ్రామ ప్రజల సౌకర్యార్థం కొరకు బస్సును ఏర్పాటు చేయించటం జరిగింది.సోమవారం గ్రామ ఉప సర్పంచ్ గురిజాల బుచ్చిరెడ్డి ఆరోగ్య రథాన్ని (బస్సు ) గ్రామపంచాయతీ కార్యాలయంవద్ద నుంచి జెండా ఊపి ప్రారంభించారు .ప్రతిమ ఆసుపత్రి లో అందించే చికిత్సలు కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు,కిడ్నీ స్టోన్స్, గర్భసంచి, గడ్డలు ,బీపీ,షుగరు, జ్వరం. చర్మ వ్యాధులు.తలనొప్పి. ముక్కు. చెవి. గొంతు, కడుపులో గడ్డలు కంతులు కండ్ల ఆపరేషన్ ఉచితంగా చేయబడును (మల్టీ) అన్ని సమస్యలకు,ఎం ఆర్ ఐ సిటీ స్కానింగ్ చేయబడును. అనారోగ్య చికిత్స కోసం ప్రతిమ ఆసుపత్రికి తరలివెళ్లారు.ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్దకు ఆరోగ్య రథం ఉదయం 9 గంటలకు వస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సంగెం కళ్యాణ్,ఎరవేని రాహుల్, ప్రతిమ ఆస్పత్రి సిబ్బంది చందు, గ్రామ ప్రజలు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని పెద్దపల్లి జిల్లా ఎ.ఎం.వి.ఐ మధు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్ పట్టణంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా ఎ.ఎం.వి.ఐ మధు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, పాఠశాల డ్రైవర్లు, ఉపాధ్యాయులకు రోడ్డు భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అయిన అధిక వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంపై వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగం ఎంత ముఖ్యమో విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. అలాగే ట్రాఫిక్ సంకేతాలు, జీబ్రా క్రాసింగ్ వినియోగం, పాదచారుల భద్రతపై అవగాహన కల్పించారు.విద్యార్థులు చిన్న వయసు నుంచే రోడ్డు భద్రత నియమాలను అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతకు సంబంధించిన బాధ్యతను తీసుకోవాలని ఆయన సూచించారు. డ్రైవర్లు మరింత అప్రమత్తంగా వాహనాలు నడపాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో భద్రతా నియమాలపై చైతన్యం తీసుకురావాలని కోరారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై విలువైన సమాచారాన్ని పొందారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు, డ్రైవర్లు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## చెస్ పోటీల్లో విద్యార్థి నవనీత్ ప్రతిభ

ప్రజాపక్షం/ముత్తారం : చెస్ పోటీలలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన విద్యార్థి ఆనుము నవనీత్ ఎం.జె.పి రామగుండం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి,విశేష ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకును సాధించారు. ఇటీవలే నిర్వహించిన చెస్ పోటీల్లో అనేక మంది పోటీదారులను వెనక్కునెట్టి ఈ ఘనత సాధించడం విశేషం.చిన్న వయసులోనే చెస్‌పై ఆసక్తి పెంచుకున్న ఆయన క్రమశిక్షణతో కూడిన సాధన, కోచ్‌ల మార్గనిర్దేశం ఫలితంగా ఈ విజయాలు అందుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ విజయంతో ముత్తారం గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చిన క్రీడాకారులను ఎం.జె.పి రామగుండం ప్రిన్సిపాల్ శిరీష, కోచ్ రాంప్రసాద్,గ్రామస్తులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.



## ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా టిఎన్‌జిఓల క్యాలెండర్ 2026

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ కరీంనగర్ జిల్లా చైర్మన్, టిఎన్‌జివోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘ నాయకులు, వివిధ శాఖల ఉద్యోగులు కలెక్టర్ పమేలా సత్పతిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంధర్భంగా టిఎన్‌జివోల జిల్లా, పట్టణ శాఖల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ 2026ను కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసేవలో ఉద్యోగులు మరింత నిబద్దతో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, టిజివోల అధ్యక్ష కార్యదర్శులు మడిపల్లి కాళీచరణ్, అరవింద్ రెడ్డి, టిఎన్‌జివోస్ కోశాధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మీందర్‌సింగ్, హరికృష్ణ, గూడ ప్రభాకర్‌రెడ్డి, గంగార రమేష్, పోలు కిషన్, నాగరాజులు పాల్గొన్నారు. పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మారుపాక రాజేష్ భరద్వాజ్, సుమంత్‌రావు, వాస్తవిక గౌడ్, శ్రీమాన్ రెడ్డి, శారద, పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరించాలని నాయకుల వినతి

ప్రజాపక్షం/కొత్తపల్లి: ఇటీవల నగరపాలక సంస్థ ప్రకటించిన ఓటరు జాబితా తప్పుల తడకులుగా ఉందని, సమగ్ర విచారణ చేపట్టి తప్పుడు ఓటరు జాబితాను సవరించి సరైన లిస్టును ప్రకటించాలని కోరుతూ దుర్శేడ్, గోపాల్‌పూర్‌కు చెందిన పలువురు నాయకులు సుంకిశాల సంపత్‌రావు, ఊరడి మల్లారెడ్డిలు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ నగరపాలక సంస్థలో నూతనంగా విలీనమైన దుర్శేడ్, గోపాల్‌పూర్ లలో 4వ డివిజన్ నుంచి కొన్ని ఓట్లు , 5వ డివిజన్‌లో కొన్ని ఓట్లు నమోదయ్యాయని, కొన్ని ఓట్లు గల్లంతయ్యాయని వాపోయారు. ఒకే పేరు వరుసగా నాలుగైదు సార్లు నమోదయ్యిందని పేర్కొన్నారు. ఒకే వ్యక్తి పేరు రావడంతో రిజర్వేషన్లలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. మరణించిన కొందరి పేర్లు సైతం జాబితాలో ప్రచురించబడ్డాయని తెలిపారు. 1444 సీరియల్ నెంబర్‌లోని చింతల వంశీ అనే వ్యక్తి పేరు వరుసగా మూడు సార్లు నమోదైందని, ఇలా నమోదుకావడంతో రిజర్వేషన్‌లో ఇబ్బంది తలెత్తే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఒక వ్యక్తి సీరియల్ నెంబర్1479 శివరామకృష్ణ అనే పేరు 1155 సీరియల్ నెంబర్ లోనూ నమోదై ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఓటర్లు తమ ఓటు హక్కు ఏ డివిజన్లో ఉందో అనే ఆందోళనలో ఉన్నారని, కావున తప్పుల తడకగా జారీ చేసి ఓటరు జాబితాను సవరించి సరైన ఓటరు జాబితాను ప్రచురించాలని కోరారు.

## పౌష్టికాహారంతోనే ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయి

ప్రజాపక్షం /మల్లాపూర్ : మండలంలోని గుండంపల్లి అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలకు బాధితులకు పౌష్టికాహార పదార్థాలను సోమవారం సర్పంచ్ డప్పుల పద్మ నరసయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే లాభాలను ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, తదితరులున్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

ప్రజాపక్షం/ముత్తారం : ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతోనే చిన్నారులకు బలం చేకూరుతుందని మచ్చు పేట గ్రామ సర్పంచి చిలివేరి జ్యోతిలక్ష్మ ణ్, ఉప సర్పంచ్ దొంతుల రాకేష్ అన్నారు. సోమవారం ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన అక్షరాభ్యాసం, అన్నప్రాసన్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ జ్యోతి లక్ష్మ ణ్ , ఉప సర్పంచ్ రాకేష్ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న కార్యక్రమం చేశారు. అనంతరం మాట్లాడుతూ తప్పనిసరిగా చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రభుత్వం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారం ఎంతో బలవర్ధకమైనది అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కళావతి, ఎమ్.ఎల్ హెచ్.పి దీప్తి, ఆశ వర్కర్ లత, వార్డు సభ్యులు బందారపు సాగర్, దేవరాజ్ పాల్గొన్నారు.

# ధర్మారంలో నూతన పాలకవర్గానికి బోధి యూత్ సన్మానం

**ప్రజాపక్షం / కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామ నూతన పాలకవర్గాన్ని సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు బోధి యూత్ ఆద్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మిర్యాల్ బాలాజీ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని దానికి బోధి యూత్ సభ్యులు అభివృద్ధిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధి యూత్ ప్రెసిడెంట్ దుంద్రపల్లి అరుణ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, సెక్రటరీ శ్రీకాంత్, వార్డు సభ్యులు నక్క పర్శరాములు,జప లక్ష్మి , తిరుపతి, నాగేష్, అజయ్, బోధి యూత్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పజాస్వామ్య పటిష్ఠతకు పట్టుకొమ్మ పత్రికలు

సిఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/ధర్మపురి :** భారత ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్ఠతకు దినపత్రికలు పట్టుకొమ్మలుగా నిలుస్తున్నాయని,వాటిలో ప్రజాపక్షం దినపత్రిక నిజాయితీతో కూడిన చక్కని కథనాలను పాఠకులకు అందిస్తూ ముందు వరుసలో వుందని జగిత్యాల జిల్లా ధర్మపురి సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి అభినందించారు. ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఎస్సైలు మహేష్, రవీందర్ లతో కలిసి సిఐ ప్రజాపక్షం దినపత్రిక 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ రాం నర్సింహారెడ్డి మాట్లాడుతూ సమస్యలను వెలికి తీస్తూ ప్రజల్ని ప్రభుత్వాన్ని చైతన్య పరుస్తున్న ప్రజాపక్షం దినపత్రిక అనతికాలంలోనే ప్రజాధారణ పొందడం అభినందనీయమని పేర్కొన్నారు.ధర్మపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక వరప్రసాద్, ఉపాధ్యక్షులు రెంటం శంకర్,ప్రజాపక్షం దినపత్రిక నియోజక వర్గ ఇన్చార్జి స్తంభంకాడి అశోక్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పటిష్ఠతకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/ధర్మపురి :** కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని టీపీసీసీ జగిత్యాల జిల్లా అబ్జర్వర్ కత్తి వెంకటస్వామి అన్నా రు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ధర్మపురి నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల స మావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.త్వరలో జ రుగబోయే మున్సిపల్, నగర పాలక, ప్రాదేశిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అ భ్యర్థులు విజయం సాధించేందుకు ప్రతీ ఒక్క రూ కృషి చేయాలన్నారు. సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్ సూచనల మేరకు త్వరలో జగిత్యాల జిల్లాకు సంబంధించి పార్టీ నూతన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు వెంకటస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు గాజెంగి నందయ్య, ధర్మపురి, గొల్లపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు దినేష్ నిశాంత్ రెడ్డి, ధర్మపురి ఏఎంసి చైర్ పర్సన్ లావణ్య, లక్ష్మ ణ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని లక్ష్మీ పూర్ గ్రామానికి చెందిన లక్ష్మి రాజయ్యకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులతో కలిసి ని ర్మాణ పనులకు సోమవారం గ్రా మ సర్పంచ్ కాసం రాజశేఖర్ కొబ్బరికాయ కొట్టి , భూమి పూజ నిర్వహించి ఇంటి నిర్మాణ పనులను ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరు సొంతింటిని కలిగి ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతిం టి కలను నిజం చేస్తుందన్నారు. స కాలంలో ఇల్లు పూర్తి చేసుకొని ప్రభు త్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సాయం పొందాలని కోరారు. ఇం డ్లు మంజూరు అయిన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం పనులను ప్రారంభి ంచాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల నుమంజూరు చేసిన సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్, ఇండ్ల మం జూరుకు కృషిచేసిన కాంగ్రెస్ నాయకులకు లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసం రాజశేఖర్ ఉప సర్పంచ్ సంగెమ్ రజిత తిరుప తి, పంచాయతీ కార్యదర్శి జీవన్ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ ల ఫోరం మండలాధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు.ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎం సరితకు అంగన్వాడీ కేంద్రంలో సోమవారం అంగన్వాడీ ఉపాధ్యాయులు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి అయిన పంచాయతీ కార్యదర్శి సరిత అంగన్వాడీ కేంద్రంలో సీమంతం చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సరితను ఆదర్శంగా తీసుకొని, ప్రతి ఒక్కరు అంగన్వాడీ కేంద్రంలోనే సీమాంతలు చేసుకోవాలన్నారు. ప్రసూతికి ప్రభుత్వ దవాఖానలో చేరాలన్నారు. నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు రామలక్ష్మి , బీ నవనీత, ఆశకార్యకర్తలు వనిత, జే రేణుక, ఐకేపీ వీఓఏ మాధవి, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

# శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం

శాలివాహన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శాలి వాహన కుమ్మర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలలోని నూతనంగా ఎన్నికైనా సర్పంచ్, ఉప సర్పంచులకు శాలువాలతో ఘనంగా సన్మానించి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా శాలివాహన కుమ్మర సంక్షేమ సంఘం 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్సై ప్రశాంత్ రెడ్డి, శాలివాహన కుమ్మర సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వంగపల్లి పర్శరాములు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, బిజెపి మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, భారాస మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో శాలివాహన కుమ్మర సంక్షేమ సం ఘం నాయకులు వంగపల్లి శ్రీనివాస్, వంగపల్లి దేవరాజు, రాము, శోభన్ బాబు, పరశురాములు, అంజ య్య, భూమలింగం, రవి, తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే బ్రిడ్జి వద్ద ఫ్లై ఓవర్ ఏర్పాటుకు రైల్వే మంత్రికి వినతి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట శివారులోని రైల్వే బ్రిడ్జి వద్ద ఫ్లై ఓవర్ ఏర్పాట్లు చేయుటకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు సోమవారం ఇండియన్ పోస్టల్ ద్వారా వినతి పత్రాన్ని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు యువ అడ్వకేట్లు పిట్టల వంశీ, గూడ రాజశేఖర్ పంపించారు. అదేవిధంగా నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ సికింద్రాబాద్ రైల్వే డివిజన్ అధికారులకు కూడా పోస్టల్ ద్వారా లేఖలు పంపినట్లు వంశీ తెలిపారు. అనంతరం జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో రైల్వే గేట్ బ్రిడ్జ సమస్యపై కలెక్టర్ కు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు వినతి పత్రాలు అందజేసి సమస్యను సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేసినట్లు వంశీ పేర్కొన్నారు. అమ్మకపేట గ్రామ శివారులో గల రైల్వే గేట్ వద్ద సుదీర్ఘ కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ గత నెలలో రైల్వే బ్రిడ్జి పై ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన కథనం తో పాటు వాటికి సంబంధించిన ఫోటోలను ఇండియన్ పోస్టల్ ద్వారా సంబంధిత రైల్వే మంత్రికి అధికారులకు, నిజామాబాద్ ఎంపీ కి పంపినట్లు వంశీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంట గూడ రాజశేఖర్, ఒర్రె మహేందర్, తదితరులున్నారు.

# జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో స్కూల్ రీప్రజెంటిటీవ్ , క్లాస్ రీప్రజెంటిటివ్ పదవుల కోసం మాక్ పోలింగ్ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. కాగా ఎన్నికలలో 156 ఓట్లు పోలవగా 110 ఓట్లు సాధించి సార రుత్విక్ స్కూల్ రీ ప్రజెంట్టివ్ ఎన్నికయ్యారు. ఐదుగురు క్లాస్ రీప్రజెంటిటివ్ కలిసి డిప్యూటీ రి ప్రజెంటేటివ్ గా అరికంటి రేవంతును ఎన్నుకున్నారు. ఆరవ తరగతి క్లాస్ రీప్రజెంటిటివ్ గా చీమల సుశాంత్, ఏడవ తరగతి ప్రజెంటేటివ్ గా న్యావనంది నిశాంత్, 8వ తరగతి రిప్రజెంటిటివ్గా వరికుప్పల రిశ్వంత్ 9 వ తరగతి రిప్రజెంటిటివ్ గా అరికంటే రేవంత్, పదవ తరగతి రీప్రజెంటేటివ్ ఆలకుంట మధు ఎన్నికయ్యారు. పోలింగ్ అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మ ణ్ ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డిలు పాల్గొ ని మాక్ పోలింగ్ పరిశీలించి ఎన్నికైన విద్యార్థులను అ భినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు

# శబరిమలకు అయ్యప్ప మాలదారులు..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండలంలోని అయ్యప్ప మాలదారులు గురుస్వామి (ముస్తాబాద్) రాజుగురుస్వామి అద్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన అయ్యప్పలు ఇరుముడితో సోమవారం శబరిమలకు అయ్యప్ప దర్శనానికి బయలుదేరారు.48 రోజుల కఠోరదీక్షను చేపట్టారు.ఇరుముడిని అప్పచెప్పి స్వామి వారిని దర్శించుకుందామని వెళ్ళారు.అయ్యప్పస్వామి కోరుకున్న మొక్కులను తీరుస్తాడని నమ్మకంతో ఉంటారు.సంపూర్ణంగా ఆత్మాభిషేకం ద్వార అనుగ్రహం తప్పక ఉంటుందన్నారు.ఇరవై తొమ్మిది మంది వరకు మండలం నుండి శభరిమలకు స్వామివారి దర్శనం కోసం వెలుతున్నామని వంగగిరిధర్‌రెడ్డి స్వామి,ఇతర అయ్యప్పమాల దారులు ఉన్నారు.

# సమష్టి కృషితో గ్రామాలు అభివృద్ధి చేసుకుందాం



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాల సమావేశ మందిరంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఉపసర్పంచులకు ఎంపీడీవో అలవాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 23 గ్రాముల సర్పంచులు ఉప సర్పంచ్‌లు హాజరుకాగా సన్మానించి అభినందనలు తెలిపారు. కాగా మండల స్థాయి అధికారులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉప సర్పంచ్ల, అధికారుల సమిష్టి కృషితో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని గ్రామాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి సమన్వయంతో వెనువెంటనే పరిష్కరించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రమేష్, ఎంపీ ఓ జగదీష్, పంచాయతీరాజ్ రాగ సుధా, వ్యవసాయ శాఖ అధికారిని లావణ్య అన్ని గ్రామాల సర్పంచ్లు ,ఉప సర్పంచ్లు పాల్గొన్నారు.

# వేగవంతంగా విద్యుత్ మోటర్ కనెక్షన్ పనులు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని భీంరాజ్ పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ మోటర్ కనెక్షన్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని రైతులు చాలాకాలంగా త్రీఫేస్ కరెంట్ అంతరాయం, లో వోల్టేజి సమస్యతో చాలా కాలాంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య తీర్చేందుకుగాను సర్పంచ్, ఉప సర్పంచ్, సభ్యుల ఆధ్వర్యంలో ఇటీవల విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడంతో ఈ క్రమంలో 25 మంది రైతులు త్రి ఫేస్ కరెంటు సాంక్షన్ కోసం డీడీలు కట్టేందుకు ముందుకు వచ్చారు. అలాగే పెండింగ్లో ఉన్న బిల్లులు చెల్లించడం జరిగింది. నూతన కనెక్షన్ల కోసం డిడిలు చెల్లించేందుకు ముందుకు వచ్చిన రైతుల కోసం వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు రూట్ మ్యాప్ కోసం సోమవారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి లైనింగ్ పనులు, సరైన ప్రణాళిక తయారు చేయడం జరిగింది.రైతుల అవసరం మేరకు మూడు నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు కు స్థల పరిశీలన చేయడం జరిగింది. త్వరలోనే నూతన ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుంది. ఇంకా ఎవరైనా గ్రామంలోని రైతులు నూతన విద్యుత్ కనెక్షన్ కోసం త్వరపడవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి, ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ,కుమార్, విద్యుత్ శాఖ అధికారులు గ్రామ పెద్దలు రైతులు,తదితరులు పాల్గొన్నారు.